'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# మైనారిటీల ప్రాతినిధ్యం

**ప్రపంచంలోని** మూడో అతిపెద్ద ముస్లిం జనాభాకు భారత్ నెలవు. ఈ కారణంగా దేశంలో ముస్లింలు రెండో అతిపెద్ద మతవర్గంగా ఉన్నారు. మైనారిటీల్లో ప్రథమ స్థానంలో ఉన్న ముస్లింలు జమ్ముకశ్మీర్‌లో మెజారిటీగా ఉండటం తెలిసిందే. అక్కడ ముస్లింలే ముఖ్యమంత్రులు కావడం ఆనవాయితీగా వస్తున్నది. కొన్ని ఇతర రాష్ట్రాల్లోనూ ముస్లింలు ముఖ్యమంత్రులయ్యారు. ఇప్పటివరకు మన దేశానికి ముగ్గురు ముస్లింలు రాష్ట్రపతులుగా కూడా చేశారు. మనదేశ లౌకిక ప్రజాస్వామ్య వారసత్వానికి ప్రతీకలుగా వీటన్నిటి గురించి గొప్పగా చెప్పుకోవడం జరుగుతుంది. పార్లమెంటులోనూ ఈ ప్రధాన అల్పసంఖ్యాక వర్గంవారి ప్రాతినిధ్యం గణనీయంగానే ఉండేది. అయితే ఇటీవలి కాలంలో అది చాలావరకు తగ్గిపోయింది. తాజాగా ఎన్నికైన 18వ లోక్‌సభలో ముస్లిం ఎంపీల సంఖ్య 24కు అంటే 4.4 శాతానికి పడిపోయింది. 20 కోట్ల జనాభా కలిగి ఉండి దేశ జనాభాలో సుమారు 15 శాతం మేర ఉన్న ఈ వర్గానికి జాతీయ చట్టసభలో బలం ఆరు దశాబ్దాల కనిష్టానికి పడిపోవడం గమనార్హం. 1980వ దశకంలో వారి ప్రాతినిధ్యం గరిష్ఠంగా 8.33 శాతానికి చేరుకున్నది.

హిందూత్వ రాజకీయాలతో బీజేపీ పైపైకి ఎదుగుతున్న నేపథ్యంలో పార్లమెంటులో ముస్లిం సభ్యుల సంఖ్య నానాటికీ తీసికట్టు అవుతున్నది. ఇంకో ముఖ్యమైన విషయం ఏమంటే బీజేపీ టికెట్‌పై గెలిచిన 240 మంది ఎంపీల్లో ఒక్కరంటే ఒక్క ముస్లిం కూడా లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే అంశం. కాంగ్రెస్ తరపున అత్యధిక సంఖ్యలో ఏడుగురు గెలిస్తే.. ఆ తర్వాతి స్థానాల్లో తృణమూల్ (5), ఎస్పీ (4) ఉన్నాయి. ఈ మూడూ సాంప్రదాయికంగా లౌకిక పార్టీలే. ఇక మిగిలినవారు ఇస్లామిక్ రాజకీయ పార్టీలుగా పేరొందిన ఐయూఎంఎల్ (3), నేషనల్ కాన్ఫరెన్స్ (2), ఎంఐఎం (1) తరపున, ఇద్దరు ఇండిపెండెంట్లుగా గెలిచారు. ఈశాన్య రాష్ట్రాల్లో ముస్లింలు ఎంపీలుగా గెలిచిన సందర్భాలు లేవు. దీనికి అసోం మినహాయింపు అయినప్పటికీ అక్కడ కూడా ఈసారి పరిస్థితి సానుకూలంగా లేదని ఫలితాలు తెలియజేస్తున్నాయి. కేరళలోనూ ముస్లిం ఎంపీ సీట్లు తగ్గిపోయాయి. బెంగాల్‌లో తృణమూల్ 29 స్థానాల్లో గెలిస్తే అందులో ఐదుగురు ముస్లింలు ఉండటం విశేషం.

దేశంలో మైనారిటీ ప్రాబల్యం క్రమంగా తగ్గుతూ పోవడానికి దేశంలో మతవిద్వేష ప్రచారం పెట్రేగడం ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇటీవలి ఎన్నికల్లో పాలక బీజేపీ నేతల ప్రసంగాలు, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు ఈ ధోరణికి పరాకాష్ఠగా నిలిచాయి. ఎన్నికల సంఘానికి దీనిపై ఫిర్యాదులు కూడా అందాయి. తీవ్రమైన మతోన్మాద వాతావరణంలో అల్పసంఖ్యాక వర్గాలు ఒత్తిడికి గురవుతూ క్రమంగా ఎన్నికలకు దూరం అవుతున్న పరిస్థితి కనిపిస్తున్నది. సంప్రదాయిక ఇస్లామిక్ రాజకీయ పార్టీలు వెనుకతట్టు పట్టడం, ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలూ ముస్లింలను నిలబెట్టేందుకు వెనుకాడటం కూడా దీనికి దోహదం చేస్తున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా ప్రశంసలు అందుకునే దేశానికి ఇది ఏ మాత్రం శోభించే విషయం కాదు. సర్వమత సమభావనతో ఎన్నికలు జరిగితేనే భారత దేశ కీర్తికాంతులు మరింతగా విస్తరిస్తాయి.

# నల్ల బంగారంపై ప్రై'వేటు'

తెలంగాణ బిడ్డ అయిన కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి 'గనులు మీరు వేలం వేస్తారా.. మమ్మల్ని వేయమంటారా?' అని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. పదవీ స్వీకారం చేసిన మూడు రోజులకే రాష్ట్రంలో సహజంగా సింగరేణికి రావలసిన బొగ్గు గనులను ప్రైవేటుపరం చేసేందుకు తొందరపడుతున్నారు. తెలంగాణకు గని మాణిక్యమైన 135 ఏండ్ల సింగరేణికి మంగళం పాడేందుకు కేంద్రంలో బీజేపీ సర్కారు ప్రణాళికలు మొదలయ్యాయి. కొత్త గనుల కోసం సింగరేణి ఇందులో పాల్గొంటే ప్రైవేటు శక్తులతో అది తట్టుకోగలదా అనేదే అనుమానం.



**బి.నర్సన్**
94401 28169



ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణలో పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను కట్టబెట్టేందుకు కంకణం కట్టుకున్న మోదీ ప్రధాని పీఠం ఎక్కగానే దేశంలోని గనుల వేలానికి తెర లేపారు. వారి పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు, ఇనుము, బొగ్గు, సున్నపురాయి మున్నగు వాటినన్నిటినీ వారికే నేరుగా అందేలా ఏర్పాట్లు చేశారు. 2014 నుంచి దేశంలోని ఖనిజ సంపద అంతా అదానీ, అంబానీ, దాల్మియా, బిర్లా, జిందాల్, అంబుజా లాంటి ప్రైవేటు కంపెనీల చేతల్లోకి వెళ్లిపోయింది. 2020లో తీసుకున్న కేంద్ర నిర్ణయం ప్రకారం బొగ్గు కేటాయింపు, ధర నిర్ణయాలపై ఆ సంస్థలకే సర్వ హక్కులుంటాయి. ప్రభుత్వ సంస్థలు కూడా వాటి నిర్ణీత ధరకే బొగ్గు కొనుక్కోవాలి. దాని వల్ల కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నది.

కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో 2020లో బొగ్గు గనుల తొలి వేలం ప్రక్రియ ప్రధాని మోదీ చేతుల మీదుగా అట్టహాసంగా మొదలైంది. దీనివల్ల రాష్ట్రాలకు, కేంద్రానికి ఆదాయం పెరుగుతుందని మోదీ అన్నారు. అయితే ఆయా రాష్ట్రాలకు మాత్రం ఈ విధానం కొత్త సమస్యలను తెచ్చిపెడుతుంది. ఉదాహరణకు సింగరేణిని తీసుకుంటే అందులో 43 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇన్నేళ్లుగా రాష్ట్రంలో కొత్తగా మొదలైన గనులు దాని స్వాధీనంలోనే పనిచేయడం వల్ల సంస్థ సమృద్ధికి, ఉద్యోగుల భవితకు ఢోకా లేకుండా గడిచింది. ఈ వేలం విధానం వల్ల కొత్త గనులను ఎవరైనా పోటీ పాటలో సొంతం చేసుకోవాలి. దేశంలో గనులపై విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 100 శాతం అనుమతి ఉన్నందున బయటి దేశాలకు కూడా ఈ అవకాశం ఉన్నది. సింగరేణి వెబ్‌సైట్ ప్రకారం ఇప్పుడు 18 ఓపెన్ కాస్టులు, 24 భూగర్భ గనులు దాని ఆధీనంలో ఉన్నాయి.

**పాత గనుల్లో బొగ్గు నిలువలు తరిగిపోగానే కొత్త గనుల అన్వేషణలో సింగరేణి ఇంతకాలం ఇబ్బంది లేకుండా కొనసాగింది. ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణి ఇప్పుడు కొత్త గనుల వేలంతో ప్రైవేట్ సంస్థలతో పోటీ పడాలి. వేలంలో ఎవరి బిడ్డింగ్ ఎక్కువ ఉంటే వారికే గనుల కేటాయింపు జరుగుతుంది.**

ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల విధి విధానాల్లో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. ప్రైవేటు సంస్థ తక్కువ వేతనాలతో, యంత్రాల సాయంతో, వీలైనంత తక్కువ సమయంలో గనిని తోడేసి బిచాణా ఎత్తేస్తుంది. అది సింగరేణికి సాధ్యపడదు. ఉద్యోగులను తగ్గించలేదు, వారి జీతభత్యాల్లో కోత పెట్టలేదు. కాబట్టి ప్రైవేటుకు పోటీగా ఈ వేలంలో పాల్గొంటే అది ఆర్థికంగా నష్టపోక తప్పదు. ఈ వేలం దందా వల్ల క్రమంగా కొత్త గనులు తగ్గి, ఉన్న ఉద్యోగులకు పనిలేక, ఉత్పత్తి లేక సింగరేణి నష్టాలపాలయ్యే ప్రమాదం ఉన్నది. సజావుగా నడుస్తున్న కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్య ప్రభుత్వ సంస్థలను కేంద్రం ఇలా పారిశ్రామికవేత్తల లాభాల కోసం బలి చేయడం దురదృష్టకరం. 2020 నుంచే తెలంగాణలోని నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో బొగ్గు గనులను వేలం వేయవద్దని, సహజంగా అవి సింగరేణి సొత్తు అని గట్టిగానే వ్యతిరేకించింది. డిసెంబర్ 2021లో మాజీ సీఎం కేసీఆర్ 'మా గనులు మాకే' అని కేంద్రానికి లేఖ రాశారు. అదే నెల తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం పిలుపుపై 43 వేల మంది సింగరేణి ఉద్యోగులు గనుల ప్రైవేటీకరణను నిరసిస్తూ 3 రోజులు సమ్మె చేశారు. 2022, ఫిబ్రవరిలో గనుల మంత్రిగా ఉన్న కేటీఆర్ కూడా రాష్ట్రంలోని 4 బొగ్గు గనుల వేలాన్ని ఆపివేయమని లేఖ రాశారు. 2022 డిసెంబర్‌లో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ హోదాలో బోయినపల్లి వినోద్‌కుమార్ కూడా సింగరేణి సంస్థకు నామినేషన్ పద్ధతిలో గనులను కేటాయించమని కేంద్రాన్ని కోరారు. కొత్త గనులు కావాలనుకుంటే సింగరేణి వేలంలో పాడుకోవచ్చని ఆనాటి కేంద్ర గనుల మంత్రి ప్రహ్లాద్ జోషి మొండిగా సమాధానం ఇచ్చారు. ఈ రోజు తెలంగాణకు న్యాయం చేయవలసిన కిషన్‌రెడ్డి కూడా అదే పాట పాడుతున్నారు. సంబంధిత శాఖ మంత్రిగా ఉండి కూడా ఆయన తెలంగాణ రాష్ట్ర, సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడలేకపోవడం ఘోరం. పైగా ప్రభుత్వాన్ని శాసించే రీతిలో మాట్లాడటం విడ్డూరంగా ఉన్నది. రాష్ట్రం సకాలంలో స్పందించకుంటే స్వయంగా వేలాన్ని నిర్వహించే అధికారం కేంద్ర గనుల శాఖకు ఉంది. అందుకే అంత హూంకరింపు.

**ఈ నెల చివరలో గనుల శాఖ తరపున వేలం నిర్వహించే అవకాశం ఉన్నదని వార్తలు వస్తున్నాయి. ఇప్పటివరకైతే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి ప్రకటనను విడుదల చేయలేదు. రాష్ట్ర ప్రయోజనాల కన్నా కేంద్రానికి అనుకూలంగా ఉండే అవకాశం ఉన్న రేవంత్ రెడ్డి ఈ విషయంలో మాత్రం కచ్చితంగా ఉండవలసిన అవసరం ఉన్నది.**

వాస్తవానికి ఏ ప్రభుత్వ సంస్థకూ ప్రైవేటు పారిశ్రామికవేత్తలతో పోటీ పడే శక్తి లేదు. పైగా కేంద్రం మొగ్గు, ప్రేమ వారి వైపే ఉంటుంది. ప్రభుత్వ సంస్థలు నష్టాల పాలు కాకుండా కాపాడవలసిన కేంద్రం చేజేతులా వాటి గొంతు కోస్తున్నది. లాభాల్లో నడుస్తున్న కామధేను లాంటి సింగరేణి పొదుగును కోసి వ్యాపారులకు అప్పగించడం జనద్రోహమే అవుతుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సహకరించదేమోనన్న భయంతో గతంలో తెలంగాణ బొగ్గు గనుల వేలం పాటకు చాలా సంస్థలు ముందుకు రాలేదు. ఇప్పుడా పరిస్థితి లేదు. మంత్రి కిషన్ రెడ్డి నిర్ణయాన్ని రేవంత్ రెడ్డి ఖండించిన వార్త రాలేదు. గత ప్రభుత్వం వలె నిరసననైనా తెలపలేదు. చివరికి తొలిసారిగా బిడ్డింగ్‌లో తమ భవిష్యత్తును సింగరేణి పరీక్షించుకోక తప్పదేమో. ప్రభుత్వం ముందుకురాని పక్షంలో ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు రాజకీయ ప్రతిపక్షాలు, సింగరేణి కార్మికులు ఐక్యమై సిరుల వెలుగుల సింగరేణిని కాపాడుకోవలసిన అవసరం ఉన్నది.

**బీఆర్‌ఎస్ ప్రభుత్వం సహకరించదేమోనన్న భయంతో గతంలో తెలంగాణ బొగ్గు గనుల వేలం పాటకు చాలా సంస్థలు ముందుకు రాలేదు. ఇప్పుడా పరిస్థితి లేదు. మంత్రి కిషన్ రెడ్డి నిర్ణయాన్ని రేవంత్ రెడ్డి ఖండించిన వార్త రాలేదు. గత ప్రభుత్వం వలె నిరసననైనా తెలపలేదు. చివరికి తొలిసారిగా బిడ్డింగ్‌లో తమ భవిష్యత్తును సింగరేణి పరీక్షించుకోక తప్పదేమో. ప్రభుత్వం ముందుకురాని పక్షంలో ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు రాజకీయ ప్రతిపక్షాలు, సింగరేణి కార్మికులు ఐక్యమై సిరుల వెలుగుల సింగరేణిని కాపాడుకోవలసిన అవసరం ఉన్నది.**

# మూడో విడతలో మూలుగుడే




**నాంచారయ్య మెరుగుమాల**

**భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రిగా ప్రమాణం చేసి పదవిలో కొనసాగిన నాయకులు ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ కంటే ముందు ముగ్గురున్నారు. ఈ ముగ్గురు మహా నేతలు పండిత జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజపేయి తమ మూడో పదవీకాలాల్లో ప్రజాదరణ కోల్పోయారు. 18వ లోక్‌సభ ఎన్నికల్లో పదేండ్లుగా పాలకపక్షం బీజేపీ మెజారిటీ సాధించడంలో విఫలమయ్యాక మొదలైన నరేంద్ర మోదీ 3.0 ప్రభుత్వం కూడా జనాదరణ కోల్పోయే అవకాశాలే కనిపిస్తున్నాయి.**

**1950** జనవరి 26న అమల్లోకి వచ్చిన రాజ్యాంగం ప్రకారం జరిగిన 1952 సాధారణ ఎన్నిక ల నుంచే నెహ్రూ పాలన మొదలైనట్టు భావిస్తే ఆయన నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు వరుసగా మూడు పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించింది. మొదటి ఎన్నికలతో పోల్చితే ఐదేండ్ల నెహ్రూ పాలన తర్వాత రెండో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం 1952 నాటి 44.99 శాతం నుంచి 47.78 శాతానికి (1962) పెరిగింది. మూడో లోక్‌సభ ఎన్నికల్లో కూడా నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్ సీట్ల పరంగా భారీ మెజారిటీ సాధించింది గాని ఈ పార్టీకి వచ్చిన ఓట్ల శాతం 44.7 శాతానికి పడిపోయింది.

**తొలిసారి అవిశ్వాస తీర్మానం:** యుద్ధంలో ఓటమి ఇంటా బయటా నెహ్రూ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చింది. 1962 లోక్‌సభ ఎన్నికల నుంచి 1963 జూలై మధ్య 10 ఎంపీ సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ 4 మాత్రమే నిలబెట్టుకోగా, ప్రతిపక్షాలు 6 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ప్రతిపక్ష దిగ్గజాలు డాక్టర్ రాం మనోహర్ లోహియా, జేబీ కృపలానీ 1963 ఏప్రిల్ ఉప ఎన్నికల్లో వరుసగా ఫారూఖాబాద్, అమ్రోహా (యూపీ) నుంచి పార్లమెంటుకు ఎన్నికవడం విశేషం. 1952 నుంచీ నల్లేరుపై బండిలా సాగుతున్న నెహ్రూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మొదటిసారి 1963 పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కృపలానీ చొరవతో ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. కాంగ్రెస్‌కు మూడింట రెండొంతులకు పైగా ఉన్న మెజారిటీ కారణంగా తీర్మానం వీగిపోయింది. కానీ, నెహ్రూకు ఇది మరచిపోలేని పరిణామం. ప్రధాని అనారోగ్యం, కాంగ్రెస్ కోల్పోతున్న ప్రజాదరణ ఫలితంగా 'నెహ్రూ తర్వాత ఎవరు?' అనే సమస్య జటిలం కాకుండా చూడటానికి 19 63 అక్టోబర్‌లో తిరుపతిలో కాంగ్రెస్ అగ్రనేత కె.కామరాజ్ ఆధ్వర్యంలో కొందరు కాంగ్రెస్ సీనియర్లు 'సిండికేట్' అనే ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. 'నెహ్రూ అనంతర కాంగ్రెస్'ను గట్టెక్కించే బాధ్యతను సిండికేట్ తలకెత్తుకున్నది. మొదట్నుంచీ కశ్మీర్ విషయంలో అప్రజాతంత్ర పోకడలకు బాటలేసిన నెహ్రూ కశ్మీర్ సింహంగా పేరొందిన షేక్ అబ్దుల్లాను ఎలాంటి విచారణ లేకుండా జైల్లో వేసి 11 ఏండ్లు ఉంచడాన్ని కశ్మీరీలు జీర్ణించుకోలేకపోయారు. ఈ పరిస్థితుల్లో శ్రీనగర్‌లోని హజ్రత్ బల్ నుంచి 1963, డిసెంబర్ 26న ప్రవక్త మహ్మద్ పవిత్ర కేశాన్ని ఎవరో తస్కరించడంతో కేంద్ర సర్కారుకు పెద్ద సమస్య ఎదురైంది. హజ్రత్ బల్ పరిణామంతో అనేక ప్రాంతాల్లో హిందూ ముస్లిం ఘర్షణలు జరిగాయి. పవిత్ర కేశం దొరికినా ఉద్రిక్తతలు చల్లారలేదు. ఈ నేపథ్యంలో 1964, జనవరి 7న భువనేశ్వర్‌లో నెహ్రూకు స్వల్ప గుండెపోటు వచ్చింది. ఆ తర్వాత ఆయనకు మే 27 ఉదయం గుండెపోటు రాగా మధ్యాహ్నం కన్నుమూశారు.

**మూడో భారీ విజయమే ఇందిరమ్మ కొంప ముంచింది:** నెహ్రూ మరణానంతరం ప్రధాని అయిన లాల్‌బహదూర్ శాస్త్రి రెండేండ్లు నిండకుండానే 1966, జనవరిలో కన్నుమూశారు. 13 రోజుల తర్వాత ఢిల్లీ గద్దెనెక్కిన ఇందిరాగాంధీ ఏడాదికే 1967 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నడిపించాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో 520 సీట్లకు గాను మెజారిటీకి (261) అవసరమైన దానికంటే కొద్ది సీట్లు (283) కాంగ్రెస్‌కు దక్కాయి. 1969 రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా పార్టీలో తలెత్తిన సంక్షోభం చివరికి నవంబర్‌లో కాంగ్రెస్ చీలికకు దారితీసింది. అత్యధిక ఎంపీలు ఇందిర వెంటే నడవడంతో ఆమె బయటినుంచి సీపీఐ, డీఎంకే వంటి పార్టీల మద్దతుతో 1971 ఆరంభం వరకూ మైనారిటీ సర్కారును నడపగలిగారు. 1969 నుంచీ రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయాకరణ, భూ సంస్కరణల అమలుకు శ్రీకారం చుట్టడం వంటి 'ప్రగతిశీల' చర్యల ద్వారా ఏడాదిన్నర కాలంలో ఇందిరకు దేశ ప్రజల్లో ఆదరణ పెరిగింది. అనుకూల వాతావరణం ఉందని పసిగట్టిన ఇందిరమ్మ ఏడాది ముందే లోక్‌సభను రద్దు చేయించి 1971 ఆరంభంలో మధ్యంతర ఎన్నికలు జరిపించగా, ఆమె హయాంలో తొలిసారి కాంగ్రెస్‌కు మూడింట రెండొంతుల మెజారిటీ వచ్చింది. 1972 ఫిబ్రవరి, మార్చిలో అనేక రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో ఇందిర పార్టీ తిరుగులేని మెజారిటీలతో ప్రభుత్వాలు ఏర్పాటుచేసింది. ఆ తర్వాత దేశంలో అనావృష్టి, ధరల పెరుగుదల, గుజరాత్, బీహార్ వంటి అనేక కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పెచ్చుమీరిన అవినీతి, నిరుద్యోగం ఫలితంగా 1974 నాటికి విద్యార్థుల ఆందోళనలు, అశాంతితో దేశం అట్టుడికింది.



**ఎమర్జెన్సీ ప్రయోగంతో భారత రాజ్యాంగానికి తాత్కాలికంగా తిలోదకాలు:** 1971లో యూపీలోని రాయబరేలీ నుంచి ఇందిర ఎన్నిక చెల్లదని 1975 జూన్‌లో అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇది జరిగిన కొద్దిరోజులకే 1975, జూన్ 25న ప్రజల అన్ని ప్రజాస్వామ్య హక్కులకూ తిలోదకాలిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. లక్ష మందికి పైగా ప్రతిపక్ష నేతలను ఎలాంటి విచారణ లేకుండా జైళ్లకు పంపించారు. చిన్న కొడుకు సంజయ్ గాంధీ, మరి కొందరితో కూడిన కోటరీ సాయంతో మొదట పరిపాలన సజావుగా సాగినా 1977 ఆరంభం నాటికి అంతర్జాతీయంగా తనకు వచ్చిన చెడ్డ పేరు, అప్పుడు ఎన్నికలు జరిపితే కాంగ్రెస్ తిరుగులేని మెజారిటీ సాధిస్తుందనే 'ఇంటెలిజెన్స్' సర్వేల జోస్యాల ఫలితంగా 1977 ఫిబ్రవరి, మార్చిలో ఇందిర జరిపించిన ఆరో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైంది. తండ్రి నెహ్రూ మాదిరిగానే ముచ్చటగా మూడోసారి ప్రమాణం చేశాక తన పాలనాకాలంలో చేసిన తప్పులు, నేరాల ఫలితంగా ఇందిరమ్మ పరాజయంతో ఇంటి బాట పట్టక తప్పలేదు.

ప్రస్తుత బీజేపీ ప్రధాని నరేంద్ర మోదీ మూడో విడత పాలన ఈ నెల ఆరంభంలో మొదలైంది. రెండో పదవీకాలంలో కేంద్ర సర్కారును నడుపుతున్న బీజేపీ అనేక సవాళ్లు ఎదుర్కొన్నది. మణిపూర్ సంక్షోభం, తీవ్ర నిరుద్యోగం, గుజరాత్ సహా అనేకచోట్ల చిన్న, మధ్యతరహా వ్యాపారాల దివాళా వంటి సమస్యలన్నింటినీ అయోధ్య రాముడి గుడి నిర్మాణంతో జనం విస్మరించేలా చేయవచ్చనే కాషాయ శిబిరం పన్నిన పథకం పారలేదు. మెజారిటీకి అవసరమైన 272 సీట్లకు 32 తగ్గి మోదీ-షా బండి 240 సీట్ల దగ్గరే ఆగిపోయింది. నిరుద్యోగం, వ్యవసాయరంగ సంక్షోభం వంటి ప్రధాన సమస్యలు మోదీ నాయకత్వంలోని మూడో ఎన్డీయే సర్కారును ఏ క్షణాన కుదేలయ్యేలా చేస్తాయో చెప్పడం కష్టమన్నట్టుంది పరిస్థితి. గుజరాత్ నుంచి వెళ్లి కాశీ ఎంపీగా పదేండ్లు పూర్తిచేసుకున్న మోదీ చివరికి యూపీ ప్రధానులు నెహ్రూ, ఇందిర మాదిరిగా తన మూడో పదవీకాలంలో జనాదరణ కోల్పోతారా? లేక రెండేళ్ల తర్వాత తనకు అనుకూలంగా కనిపించిన సమయంలో 18వ లోక్‌సభ రద్దుకు సిఫారసు చేయించి మధ్యంతర ఎన్నికలు జరిపిస్తారా? అనేది ఇప్పుడెదురవుతున్న ప్రశ్న.



**రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ, ఆరు నెలల కాలం ఎన్నికల కోడ్‌తోనే గడిచిపోయింది. అయినా, ఇంకా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పరిపూర్ణంగా ప్రజా సమస్యల పరిష్కారంలో నిమగ్నమైనట్టు రాష్ట్రంలో పరిస్థితి కనిపించట్లేదు.**

# పగ, ప్రతీకారాలేనా?



**కందుకూరి యాదగిరి**
96402 82050

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ముఖ్యమైన హామీ ఆరు గ్యారంటీలు. వీటిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అమలులో ఉన్నది. ఇక మిగతా పథకాలను కూడా ప్రజల వద్దకు చేరేట్టుగా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉన్నది.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం పత్రికల ప్రకటనలకు మాత్రమే పరిమితమైందని మేధావులు విశ్లేషిస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా ఎంతసేపూ గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల్లో అవినీతిని వెతికేందుకే తంటాలు పడుతున్నారు. అంతే తప్ప తాము ఎంతవరకు ప్రజా సమస్యలపై స్పందిస్తున్నామన్న సంగతిని మర్చిపోతున్నారు. గత ప్రభుత్వం పదేండ్లలో ప్రజలకు ఏం చేయగలిగింది, ఏం చేయలేకపోయింది? అని ప్రజల్లోకి వెళ్లి ఒక సర్వే నిర్వహించి మెజారిటీ ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వం ఆ దిశగా ముందుకు కొనసాగినప్పుడే ప్రజల మద్దతు లభిస్తుందన్న విషయాన్ని మరువరాదు.

పరిపాలన విధానంలో పెద్దగా కష్టపడాల్సిన పనేమీ లేదు, అంతా సిద్ధం చేసే ఉంచామని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అంటున్నారు. ఇది నూటికి నూరుపాళ్లు నిజం. అరువై ఏండ్ల ఆంధ్రా పాలకుల పెత్తందారీ విధానంతో తెలంగాణ ప్రజలు విసిగి వేసారిపోయారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి 2023 శాసనసభ ఎన్నికల వరకు అన్ని శాఖల్లో జరిగిన ప్రక్షాళన, ప్రగతితో తెలంగాణ రాష్ట్రం కళకళలాడుతున్నది. ఈ నిజాన్ని 90 శాతం ప్రజలు కాదనలేరు. దాని ఆధారంగా ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వడివడిగా అమలు చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన చేయవచ్చు. కానీ, కాంగ్రెస్ నాయకులు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ప్రతిపక్ష నాయకులపై పగ, ప్రతీకారాలు పెంచుకుంటున్నారు. అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.

కొత్త ప్రభుత్వం ఏర్పడి చూస్తుండగానే ఆరు నెలలు గడిచిపోయాయి. మరో నాలుగున్నరేండ్లు మాత్రమే పాలించే అవకాశం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నది. ఇందులో చివరి ఆరు నెలల్లో ఎన్నికల హడావుడే ఉంటుంది. ప్రజలకేం పని చేసినా మధ్యలో నాలుగేండ్లు మాత్రమే. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పనికిరాని పనులను పట్టించుకోకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం, వారు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సంసిద్ధులు కావాలి. క్షణం తీరిక లేకుండా కష్టపడితే కానీ, అనుకున్న స్థాయిలో ప్రజలకు న్యాయం చేయలేరు. ఇదిలా ఉంటే త్వరలోనే గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలు, ఆ తర్వాత మున్సిపాలిటీల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నది. కచ్చితంగా చెప్పాలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి మూడున్నరేండ్ల అవకాశం మాత్రమే ఉన్నదని విశ్లేషకులు చెప్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పూర్తిగా కంకణబద్ధులు కావాలని ప్రజలు భావిస్తున్నారు.

**(వ్యాసకర్త: సీనియర్ పాత్రికేయులు)**




## స్టాక్‌మార్కెట్ చరిత్రలో అతిపెద్ద స్కామ్!

*మొన్నటి సార్వత్రిక ఎన్నికల ఫలితాల వేళ దేశీయ స్టాక్‌మార్కెట్‌లో అతిపెద్ద స్కామ్ జరిగింది. అదే స్టాక్‌మార్కెట్-ఎగ్జిట్‌పోల్ స్కామ్. మే 31న కొంతమంది విదేశీ సంస్థాగత మదుపరులు స్టాక్‌మార్కెట్‌లో తమ పెట్టుబడులను రెట్టింపు చేశారు. అంటే ఎగ్జిట్‌పోల్స్ ఏం చెప్పబోతున్నాయో ఆ మదుపరులకు ముందే తెలుసా?*



**- సాగరికా ఘోష్,** టీఎంసీ రాజ్యసభ సభ్యురాలు